సాక్షి
నల్లగొండ

బుధవారం ၊ 7 ၊ మే ၊ 2025



**హైవే.. ఆరు వరుసలు**
హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. -8లో



**ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు**
మాధారంకలాన్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
40°/27°

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### రేణుకా ఎల్లమ్మకు అభిషేకాలు



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

**కనగల్ :** మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పసుపు కుంకుమతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. అర్చకులు అమ్మవారికి హారతి ఇచ్చారు.

### సఖి కేంద్రం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఉమాదేవి

**నల్లగొండ:** జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ ఉమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం అందించే సేవలు, కేంద్రంలో నమోదవుతున్న కేసుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాధితుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే మహిళా కమిషన్ సహాయాన్ని కూడా కోరవచ్చని సిబ్బందికి తెలిపారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సఖీ సిబ్బంది వరుణశ్రీ, సునీత, గీత, నాగమణి ఉన్నారు.

### ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా శేఖర్‌రెడ్డి



**నల్లగొండ:** ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. కాగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన మాన్యనాయక్ గత నెల 30న పదవీ విరమణ చేశారు.

### 13న పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్ష

**రామగిరి(నల్లగొండ) :** పాలిసెట్–2025 ఎంట్రెన్స్ పరీక్ష ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్. నరసింహారావు తెలిపారు. మొత్తం 5203 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలో మొత్తం 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. ఒక నిమిషం నిబంధన వర్తిస్తుందని, 11 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హెచ్‌బీ పెన్సిల్, బ్లూ, బ్లాక్ బాల్‌పెన్, ఎరైజర్, రైటింగ్ ప్యాడ్ తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలన్నారు.

### ఇన్‌చార్జ్ సీపీఓగా సామ్యేల్

**నల్లగొండ:** భువనగిరి సీపీఓ సామ్యేల్‌కు నల్లగొండ ఇన్‌చార్జ్ సీపీఓగా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. సామ్యేల్ సీపీఓగా బాధ్యతలు స్వీకరించారు. కాగా నల్లగొండ సీపీఓగా పనిచేసిన మాన్యనాయక్ గత నెల 30న పదవీ విరమణ చేశారు.

### శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఈఓ భిక్షపతి

**తిప్పర్తి :** విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంలోని కస్తూరిబా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ విద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, పెయింటింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. వివిధ కస్తూరిబా పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థినులు ఈ శిక్షణలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 19 వరకు శిక్షణ శిబిరం జరుగనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జీఈసీఓ అరుంధతి, ఎంఈఓ నర్సింహా నాయక్, ఎస్‌ఓ రాజరాజేశ్వరీ ఉన్నారు.

# ఎగుమతికి లారీలేవీ?

## ధాన్యం లిఫ్ట్ కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల నిరీక్షణ

**తూకం వేసిన ధాన్యం బస్తాలు కల్లాల్లోనే..**

- లారీల కొరతతో కొన్నిచోట్ల కాంటాలు కూడా వేయడం లేదు
- 750 లారీలకు.. రోజూ నడుస్తున్నవి 150 లారీలే..
- లారీలు లేని వారికి ధాన్యం ఎగుమతి కాంట్రాక్టులు
- ధాన్యం ఎగుమతి అయినా.. మిల్లుల వద్ద కూడా కొర్రీలు
- పంట అమ్ముకునేందుకు రైతులకు సవాలక్ష కష్టాలు



నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన ఈమె ఆదె మల్లమ్మ. కౌలుకు తీసుకున్న ఆరెకరాల్లో పండించిన ధాన్యాన్ని మూడు వారాల కిందట మార్కెట్ యార్డు ఆవరణలోని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చారు. పది రోజుల కిందటే నిర్దేశిత తేమ శాతం వచ్చింది. ఆ వెంటనే బస్తాలు కూడా ఇచ్చారు. లారీలు సమయానికి రాకపోవడంతో ధాన్యం కాంటా కాలేదు. దీంతో పది రోజులుగా అక్కడే ఉండాల్సి వస్తోంది.

చండూరు మండలం పుల్లెంల కొనుగోలు కేంద్రంలో దాదాపు 150 మంది రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఎదురుచూస్తున్నారు. నిర్దేశిత తేమ శాతం వచ్చి 15 రోజులు అవుతున్నా లారీల కొరతతో ఎదురుచూపులు తప్పడం లేదు. సోమవారం రాత్రి కలెక్టర్ వచ్చాక కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. కలెక్టర్ తనిఖీ సమయంలో డీఎస్‌ఓ రెండు లారీలు పంపిస్తానని హామీ ఇచ్చినా, ఒక లారీ మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు. కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి కేవలం నాలుగు లారీలు మాత్రమే వచ్చాయి. దీంతో రైతులు డీసీఎంలను కిరాయికి తీసుకొని ధాన్యాన్ని మిల్లులకు తరలించుకుంటున్నారు.

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ:** ధాన్యం అమ్ముకునేందుకు అన్నదాతలు ఎన్నో కష్టాలు పడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల అజమాయిషీ లేకపోవడంతో ధాన్యం కల్లాలకు తెచ్చిన రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నిర్దేశిత తేమ శాతం వచ్చినా తూకం వేయక, వేసినా కూడా లారీలు రాక రోజుల తరబడి ఆ కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన వస్తోంది. కొన్ని చోట్ల లారీ కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో రైతులే వాహనాలను పెట్టుకొని ధాన్యం తరలించాల్సి వస్తోంది. ఆ తరువాత ట్రక్ షీట్ ఆలస్యంగా రావడం, చివరకు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు రావడం కూడా 20 రోజులపైనే పడుతోంది.

**కొర్రీలు పెట్టి కోత విధిస్తున్నారు**

కల్లాలలో తూకం వేసేప్పుడు బస్తాకు కిలో అధికంగా తూకం వేస్తుండగా, తూకం వేసిన ధాన్యం మిల్లరు వద్దకు తీసుకెళ్లాక, ధాన్యం బాగలేదంటూ దిగుమతి చేసుకోకుండా కొర్రీలు పెడుతున్నారు. దీంతో సంబంధిత కొనుగోలు కేంద్రానికి మిల్లర్లు ఫలానా రైతు ధాన్యం బాగలేదని చెప్పడం, దీంతో నిర్వాహకులు నీ ధాన్యం బాగలేదంట.. బస్తాకు 2 కిలోలు మిల్లర్లు కోత వేస్తారట.. లేదంటే నీ ఇష్టం అని చెబుతుండటంతో రైతులు అందుకు అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా 40 కిలోల బస్తాకే 3 కిలోల చొప్పున రైతును దోపిడీ చేస్తున్నారు. అందుకు ఒప్పుకుంటేనే ట్రక్ షీట్ రైతుకు అందుతోంది. అప్పుడే ఆ ట్రక్ షీట్ ఆధారంగా రైతు ఎంత విక్రయించారన్న వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. లేదంటే ధాన్యం వెనక్కి పంపిస్తామంటూ బెదిరిస్తున్నారు.



నల్లగొండ మండలం ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

**మిల్లర్లు ఆడిందే ఆట..**

మిల్లర్లు ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా తయారైంది. అసలే కాంట్రాక్టర్లు కొద్దిపాటి లారీలను ధాన్యం రవాణాకు పంపిస్తున్నారు. అయితే ధాన్యం దిగుమతి చేసుకోలేమంటూ నల్లగొండ చుట్టుపక్కల ఉన్న మిల్లర్లు రెండు మూడు రోజులు కొర్రీలు పెట్టడంతో నల్లగొండ ధాన్యాన్ని మిర్యాలగూడ, దేవరకొండ మిల్లులకు తరలించినట్లు సమాచారం. అంటే ఇటు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు కూడా ప్రభుత్వంపై అదనంగా పడుతున్నాయి. మొత్తంగా ధాన్యం కొనుగోలు వ్యవహారంలో అధికారుల అజమాయిషీ పక్కాగా లేకపోవడంతో మిల్లర్లు చెప్పిందే వినాల్సి వస్తోంది. కాగా, రోజుకు ఒక్కో కల్లానికి రెండు చొప్పున నల్లగొండ జిల్లాలోని 375 కేంద్రాలకు దాదాపు 700 లారీలను పంపించాల్సి ఉన్నా రెండు మూడు రోజులకు ఒకటి చొప్పున 150 లారీలు కూడా రాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో లారీ కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో లారీలు లేకున్నా టెండర్లు దక్కించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

**పక్షం రోజులుగా నిరీక్షణ**



కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రానికి 200 బస్తాల ధాన్యం తెచ్చి పక్షం రోజులుగా ఎదురుచూస్తున్నా. లారీల సరిపడా రాక కాంటా వేయడం ఆలస్యం అవుతోంది. పట్టాల ఖర్చు భారమవుతోంది. అడపాదడపా కురిసే అకాల వర్షం, గాలి దుమారానికి పట్టాలు లేచి పోకుండా రాశిని కనిపెట్టుకుని ఉండాల్సి వస్తోంది.

– జిల్లా రాజయ్య, కొప్పోలు, గుర్రంపోడు

**బస్తాకు 3 కిలోలు కోత**



తూకం వేసేప్పుడు 40 కిలోల బస్తాకు కిలో ఎక్కువగా జోకుతున్నారు. ధాన్యం మిల్లుకుపోయిన తర్వాత తాలు పేర అక్కడ మిల్లర్ 2 కిలోలు కోత పెడుతుండు. లేదంటే ధాన్యం దించుకోవడం లేదు. కోతకు ఒప్పుకుంటేనే ట్రక్‌షీట్ ఇస్తున్నారు.

– సత్తయ్య, నల్లగొండ

**లారీల సమస్యకు ఇవీ ఉదాహరణలు**

- కట్టంగూరు మండలం అయిటిపాముల కేంద్రంలో రెండు రోజుల కిందట కాంటా వేసిన ధాన్యాన్ని మంగళవారం ఒక లారీలో తరలించారు. రోజుకు ఐదు లారీల ధాన్యం తరలించాల్సి ఉండగా ఒకటి, రెండు లారీలే వస్తున్నాయి.
- శాలిగౌరారం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సోమవారం తూకం వేసిన 12,700 బస్తాల ధాన్యం.. లారీలు రాకపోవడంతో మంగళవారం సాయంత్రం వరకు ఎగుమతులు కాలేదు. అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8,900 బస్తాలు, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో 3,800 బస్తాల ధాన్యం నిల్వలు ఉన్నాయి. అందులో శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని పీఏసీఎస్ కేంద్రంలోనే అత్యధికంగా 4వేల బస్తాలు నిల్వ ఉన్నాయి.
- చందంపేట మండలంలోని పోలేపల్లి స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 20 రోజుల నుంచి సరిగ్గా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. నిర్దేశిత తేమ శాతం వచ్చినా జాప్యం చేస్తున్నారు. లారీల కొరత కారణంగానే ఆలస్యం చేస్తున్నారు. మిల్లు వద్ద ఒక లారీని అన్‌లోడ్ చేయాలంటే మూడు రోజులు పడుతోందని చెబుతున్నారు.
- గుర్రంపోడు మండలంలో లారీల కొరతతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 90 శాతం ధాన్యం తేమశాతం వచ్చినా లారీలు రాకపోవడంతో కాంటాలు వేయడం లేదు. ఒక్క కొప్పోలు కేంద్రంలోనే 40 లారీల ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది. రోజు నాలుగైదు లారీలు రావాల్సి ఉండగా ఒకటి, రెండు మాత్రమే వస్తుండటంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి.



ఎస్‌ఎల్‌బీసీ కొనుగోలు కేంద్రం వద్ద వర్షం పడుతుండడంతో ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు

# ఇల్లు ఇప్పించండి సారూ..

- ఒకే ఇంట్లో 16 మంది నివాసం
- ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో లేని నిరుపేదల పేర్లు



కోడళ్లు, మనవళ్లతో ఇరగదిండ్ల యశోద

**చందంపేట :** అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఆ నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. గత ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు తమకు వస్తాయని అనుకుంటే డ్రాలో వీరి పేరు రాలేదు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లు అయినా వస్తాయి అనుకుంటే జాబితాలో ఆ నిరుపేద కుటుంబాల పేర్లు లేకుండా పోయాయి. చందంపేట మండల కేంద్రానికి చెందిన ఇరగదిండ్ల యశోద–ఎల్లయ్య దంపతులకు నలుగురు కుమారులు. ఇందులో ముగ్గురికి వివాహం కాగా వారికి 8 మంది సంతానం. ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. రెండు గదుల స్లాబ్, రెండు గదుల రేకులతో కూడిన ఇంట్లో నివాసం ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముగ్గురు అన్నదమ్ముల కుటుంబాలను డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అర్హులుగా గుర్తించినప్పటికీ డ్రాలో వీరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఆశించారు. కానీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో వీరి పేరు లేదు. ముగ్గురు అన్నదమ్ములకు వేర్వేరుగా తెల్ల రేషన్‌కార్డులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో వీరి పేరు లేదు. ఇంతమంది ఒకే ఇంట్లో ఉండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కనికరించి తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి**



నాకు నలుగురు కొడుకులు. అందులో ముగ్గురు కొడుకలకు పెళ్లి అయ్యింది. ఆ ముగ్గురు కొడుకులకు కలిపి 8 మంది పిల్లలు ఉన్నారు. మొత్తం 16 మంది ఒకే ఇంట్లో నివసిస్తున్నాం. మా కొడుకులు లారీ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం నా భర్త చనిపోతే నేను కూలి పనికి పోయి జీవిస్తున్నా. ఇప్పుడున్న ప్రభుత్వం నా కుమారులకు ఇళ్లను కేటాయించాలి. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో మా కుమారుల పేర్లు లేవు. అధికారులు కనికరించి ఇళ్లు కేటాయించాలి.

– ఇరగదిండ్ల యశోద

# అనుమతి లేని పాఠశాలల ప్రచారానికి బ్రేక్

- మూడు పాఠశాలలకు అనుమతి లేదని విద్యాశాఖ ప్రకటన



**నల్లగొండ:** జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రచారాలు చేసుకుంటూ విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించుకునే పనిలో నిమగ్నమయ్యాయి. వాటిని గుర్తించిన విద్యాశాఖ పాఠశాలల ప్రచారానికి బ్రేక్ వేస్తూ ప్రకటన చేసింది. అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దంటూ ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించుకునేందుకు పాఠశాలలకు సెలవులు రాకముందు నుంచే టీచర్లను ఊళ్లలోకి పంపి కాన్వసింగ్ నిర్వహిస్తున్నాయి. ఒక్కో ఉపాధ్యాయునికి టార్గెట్ ఇస్తూ యాజమాన్యాలు గ్రామాల్లోకి పంపుతున్నాయి. కొన్ని పాఠశాలలు పదో తరగతి ఫలితాల తర్వాత విస్తృత ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మభ్య పెట్టి పాఠశాలల్లో చేర్పించే పనిలో ఉన్నాయి.

**అనుమతి లేని పాఠశాలలు ఇవే..**

జిల్లాలోని పలు అనుమతి లేని పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి విద్యార్థులను తమ పాఠశాలల్లో చేర్పించుకుంటున్నాయి. దీంతో కొందరు విద్యాశాఖకు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులను పరిశీలించిన డీఈఓ భిక్షపతి నల్లగొండ పట్టణంలోని రవీంద్రనగర్‌లో గల జయ హైస్కూల్, హాలియాలోని శ్రీచైతన్య హైస్కూల్, దేవరకొండలోని శ్రీచైతన్య హైస్కూళ్లకు అనుమతి లేదంటూ ప్రకటన విడుదల చేశారు.

**విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి**



అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించేటప్పుడు ఆ పాఠశాలలకు ప్రభుత్వ అనుమతి ఉందా.. లేదా అని నిర్ధారించుకున్న తర్వాత చేర్పించాలి. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి.

– భిక్షపతి, డీఈఓ

# ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో ద్వితీయ స్థానం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

**గుర్రంపోడు :** ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్ తర్వాత నల్లగొండ జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. మంగళవారం లారీల సమస్య ఎక్కువగా ఉన్న గుర్రంపోడు, కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను సరిపడా పంపేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లారీలు సరిపడా లేకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి దళారీలు ధాన్యం తీసుకువస్తే కేసులు నమోదు చేస్తున్నామని, మిల్లర్లు ఇబ్బందులు పెడితే వారిపై చర్యలకు వెనుకాడబోమని అన్నారు. తనతోపాటు పౌరసరఫరాల అధికారులు, అదనపు కలెక్టర్ ప్రతిరోజు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొప్పోలు కేంద్రంలో రికార్డులను పరిశీలించిన కలెక్టర్.. సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపీడీఓ మంజుల, వ్యవసాయ అధికారి మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

**ఎర్రబెల్లి చెరువును పరిశీలించిన కలెక్టర్**

**నిడమనూరు :** మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో గల శనిగకుంట చెరువు, ఊట్కూరు గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. ఊట్కూర్ కొనుగోలు కేంద్రంలో వారం రోజుల్లోపు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాకులను ఆదేశించారు. ఎర్రబెల్లి శనిగకుంట చెరువుకు ఎగువన ఎర్రబెల్లి గ్రామ శివారులో ఏఎమ్మార్పీ లోలెవల్ కెనాల్ ప్రవహిస్తోంది. ఈ కెనాల్ నుంచి శనిగకుంట చెరువును నింపడానికి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను రెవెన్యూ, నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ప్రస్తుతం ఈ కెనాల్‌కు అనుబంధంగా స్థానిక రైతులు కుంటను ఏర్పాటు చేసుకుని మోటార్ల ద్వారా సాగునీటిని మళ్లిస్తున్నారు. చెరువును మినీ రిజర్వాయర్ ఏర్పాటు చేసి, సాగునీరందిచాలని దీర్ఘకాలంగా ఉన్న డిమాండ్ నేపథ్యంలో కలెక్టర్ చెరువును పరిశీలించారు. కలెక్టర్ వెంట నిడమనూరు తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, సర్వేయర్ పోకల విజయ్, కృష్ణయ్య, ఆర్ఐ సందీప్, ఐబీ డీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కొప్పోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

# ప్రభుత్వ భూమి ఆక్రమణ



వెల్మకన్నె గ్రామంలో భూమిని సర్వే చేస్తున్న తహసీల్దారు (ఫైల్)

- పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు గతంలో కొనుగోలు
- గ్రామంలో సఖ్యత లేకపోవడంతో పట్టాలు ఇవ్వని అధికారులు
- ఇదే అదనుగా భూమిని ఆక్రమించిన ఓ వ్యక్తి
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

**గట్టుప్పల్ :** ఆనాటి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా 25 ఏళ్లుగా ప్రభుత్వ భూమి నిరుపయోగంగా మారింది. ఆ భూమిపై కన్నేసిన పక్కన వ్యవసాయ భూమి కలిగిన ఓ వ్యకి ఎకరం వరకు ఆక్రమించుకున్నాడు. కోట్ల రూపాయల విలువ చేసే భూమి ఆక్రమణకు గురికావడంపై ఆ గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన భూమిని కాపాడాలని రెవెన్యూ అధికారుల చుట్టూ నెలలుగా తిరుగుతూనే ఉన్నారు. అయితే అనేక కారణాలు చూపిస్తూ అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్ప పట్టించుకోవడం లేదని యువకులు ఆరోపిస్తున్నారు. గట్టుప్పల్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వెల్మకన్నె గ్రామంలో 1999 సంవత్సరంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రైవేట్ వ్యక్తులు నుంచి ప్రధాన రహదారికి ఆనుకుని ప్రభుత్వం ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఆనాడు హద్దురాళ్లు నిర్ణయించి పేదలకు పంచేందుకు ప్లాట్లను కూడా అధికారులు చేశారు. కానీ గ్రామంలో సఖ్యత లేకపోవడంతో వాయిదాలు పడుతూ వచ్చింది.

**ఫిర్యాదు చేసిన యువకులు**

గ్రామ యువకుల ఫిర్యాదు మేరకు జనవరి నెలలో తహసీల్దార్ రాములు ఆ భూమిలో సర్వేయర్‌తో నేరుగా సర్వే చేయించారు. ఆరు ఎకరాల భూమిలో 10 గుంటల వరకు దేవాలయానికి పోను మిగిలిన భూమిలో ఎకరం వరకు ఆక్రమణకు గురైందని అధికారులు తేల్చారు. భూమి ఆక్రమించిన రైతుకు నోటీసులు ఇస్తే సమయానికి హాజరు కాలేదని తహసీల్దారు చెబుతున్నారు.

**అధికారుల తప్పిదం..**

ఆనాడు ప్రధాన రహదారి వెంట సర్వే నంబర్ 56, 57లలో ఆరు ఎకరాలను రెవెన్యూ అధికారులు గుర్తించి ప్రతిపాదనలు పంపిస్తే.. ప్రభుత్వం ఆ భూమిని కొనుగోలు చేసింది. అధికారులు మాత్రం 55 సర్వే నంబర్‌లోని 6 ఎకరాలను పేదలకు పొజిషన్ చూపించారు. కొనుగోలు చేసింది ఓ సర్వే నంబర్ కాగా.. పొజిషన్ మరో సర్వే నంబర్ అనే విషయం ఆనాడు పేదలకు తెలియక ఇదే భూమి కదా అని ఒప్పుకున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగింది. అయితే ఇదే భూమి పక్కనే ఉన్న ఓ రైతు వేరే సర్వే నంబర్ భూమిని పట్టా చేయించుకుని 55 సర్వే నంబర్‌లోని పేదలకు సంబంధించిన భూమిని ఆక్రమించుకున్నాడు. దీంతో గ్రామానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని ఎలా ఆక్రమించుకుంటారని గ్రామ యువకులు ఆందోళనకు దిగారు. ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌లకు ఆ యువకులు వినతి పత్రాలు అందజేశారు.

**భూమిని స్వాధీనం చేసుకోవాలి**



ప్రభుత్వ భూమి ఆరు ఎకరాలు ఉండాలి. ఎకరం ఆక్రమణకు గురైంది. అధికారులు వెంటనే ఎకరం భూమి స్వాధీనం చేసుకోవాలి. నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాలయాపనపై మాకు అనేక అనుమానాలు ఉన్నాయి.

– రావుల ఎల్లప్ప, వెల్మకన్నె

**హద్దురాళ్లు నాటాలి**



ఆరు ఎకరాల భూమికి హద్దురాళ్లు నాటాలి. ఆక్రమించుకున్న ఎకరం భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలి. ఆనాడు 56, 57 సర్వే నంబర్‌లో భూమిని కొనుగోలు చేయించి, 55 సర్వే నంబర్‌లో పొజిషన్ చూపించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు.

– గంగనబోయిన మహేష్, వెల్మకన్నె

**ఆక్రమణకు గురైంది నిజమే**



ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేశాం. అందులో ఎకరం భూమి ఆక్రమణకు గురైంది నిజమే. ఆ భూమికి సంబంధించిన ఫైల్ మా దగ్గర లేదు. ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే డీఐతో సర్వే చేయించి హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే ఊరుకునేది లేదు.

– రాములు, గట్టుప్పల్ తహసీల్దారు

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


కొప్పుల శ్రీజ

నకిరేకల్: జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నకిరేకల్ మండలం మంగళపల్లికి చెందిన కొప్పుల శ్రీజ ఎంపికైంది. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన శ్రీజ ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీజ పాల్గొంటుందని తెలిపారు.







# హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

- స్వయంగా ప్రకటించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- రూ.10వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు నిర్ణయం
- విస్తరణ పూర్తయితే ప్రయాణం సులువు
- బ్లాక్‌స్పాట్‌ల వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు

# హైవే.. ఆరు వరుసలు


హైదరాబాద్-విజయవాడ హైవేపై చౌటుప్పల్ మండలంలోని ధర్మోజిగూడెం జంక్షన్

చౌటుప్పల్: హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారి త్వరలోనే ఆరు వరుసలుగా మారనుంది. రూ.10వేల కోట్లతో ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని ఆంథోల్ మైసమ్మ దేవాలయం వరకు ఆరు వరుసల రహదారి విస్తరణతో పాటు సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. ఇక అక్కడి నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 181 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలోనే రెండు తెలుగు రాష్ట్రాలు ఈ హైవేను ఆరు వరుసలుగా విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయితే రకరకాల కారణాలతో ఇప్పటివరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో హైవే విస్తరణ ప్రక్రియ పట్టాలెక్కింది.

**నాలుగు వరుసల కోసం ఎన్నో పోరాటాలు**

హైదరాబాద్-విజయవాడ హైవే రెండు వరుసలుగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా జరుగుతుండడంతో ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలని ప్రజలు అనేక పోరాటాలు చేశారు. ఆ తర్వాత దీనిని నాలుగు వరుసలుగా విస్తరించినప్పటికీ ప్రమాదాల సంఖ్య తగ్గడంలేదు. 2011 నుంచి వందలాది మంది తమ ప్రాణాలను కోల్పోయారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఈ హైవే గుండా వాహనాలు రాకపోకల సంఖ్య పెరగడంతో రద్దీగా మారింది. ఆ రద్దీకి అనుగుణంగా నాలుగు వరుసలు ఏమాత్రం సరిపోవడంలేదు. దీంతో ఆరు వరుసలుగా విస్తరించాలని గత కొన్నేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరుతూనే ఉన్నాయి. అయితే గతంలో ఈ హైవేను నాలుగు వరసలుగా విస్తరించిన జీఎంఆర్ సంస్థ కోర్టుకు వెళ్లడంతో గతేడాది వరకు ఈ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ప్రస్తుతం జీఎంఆర్ సంస్థను ఈ హైవే బాధ్యతల నుంచి తప్పించారు. దీంతో అడ్డంకులు తొలగడంతో విస్తరణ అంశం వేగంగా ముందుకుసాగుతోంది.

**ప్రమాదాలను అరికట్టేందుకు ప్రయత్నాలు**

ఈ హైవేపై కొన్ని ప్రాంతాల్లోనే తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. అసలు ఈ ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి, ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంలో నిర్వహించిన సర్వేల్లో అనేక కారణాలను గుర్తించారు. ఈ మార్గంలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ శివారు వరకు 17 బ్లాక్‌స్పాట్‌లు ఉన్నట్లు గుర్తించారు. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూర్, ఇనుపాముల, టేకుమట్ల, ఎస్వీ కళాశాల-జనగామ ఎక్స్‌రోడ్, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి జంక్షన్, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ ఎక్స్ రోడ్, కాటమ్మగూడెం, మేళ్లచెరువు, శ్రీరంగాపురం, రామాపురం ఎక్స్‌రోడ్, నవాబ్‌పేట జంక్షన్ బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్నాయి. ముందుగా అత్యంత ప్రాధాన్యతా క్రమంలో ఆయా ప్రాంతాలలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని నిర్ణయించి కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించారు. అందులో భాగంగా ప్రస్తుతం ఆయా బ్లాక్‌స్పాట్‌లలోని కొన్ని ప్రాంతాల్లో పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మరికొన్ని ప్రాంతాలలో ప్రారంభంకానున్నాయి.

### మరికొన్ని బ్లాక్‌స్పాట్‌లకు విస్తరణలో మోక్షం

ఈ మార్గంలో ఇంకా అనేక బ్లాక్‌స్పాట్‌లు ఉన్నాయి. వాటిని గుర్తించాల్సి ఉంది. గతంలో గుర్తించిన వాటికే ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తుండడంతో.. అప్పట్లో గుర్తించని ప్రాంతాలను మరోసారి గుర్తించి కేంద్రానికి నివేదిక అందిస్తే ఆరు లేన్ల విస్తరణ సమయంలో ప్రక్రియ సునాయాసమవుతుందని పలువురు భావిస్తున్నారు. ఇదే విషయమై ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వర్‌రావును సంప్రదించగా.. ఆరు వరుసల విస్తరణ ప్రక్రియలో వంతెనల నిర్మాణాలకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. చాలా రోజులుగా జరిగిన ప్రయత్నాలతో చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామ జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జికి ఆమోదం లభించిందన్నారు.వీలైనంత త్వరలోనే అక్కడ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

**అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించే బ్లాక్‌స్పాట్‌ల వివరాలు..**

| గుర్తించిన బ్లాక్ స్పాట్‌లు | అంచనా విలువ (కోట్లలో) |
|---|---|
| పెద్దకాపర్తి | 29.90 |
| చిట్యాల | 42.18 |
| నల్లగొండ క్రాస్‌రోడ్డు, కట్టంగూర్ | 0.26 |
| కొర్లపహాడ్ | 5.96 |
| ఎస్‌వి.ఇంజనీరింగ్ కాలేజ్, జనగామ క్రాస్ రోడ్డు | 58.04 |
| ఈనాడు ఎదురుగా | 27.97 |
| దురాజ్‌పల్లి | 2.80 |
| ముకుందాపురం | 13.86 |
| ఆకుపాముల | 2.16 |
| కొమరబండ ఎక్స్ రోడ్డు | 31.01 |
| కటకమ్మగూడెం | 10.89 |
| మేళ్లచెరువు | 0.46 |
| శ్రీరంగాపురం | 8.50 |
| రామాపురం ఎక్స్‌రోడ్డు | 30.26 |
| నవాబుపేట | 0.21 |
| మొత్తం | 264.84 |

**ఎట్ గ్రేడ్ జంక్షన్ తొలగించే ప్రాంతాల్లో..**

| | |
|---|---|
| చౌటుప్పల్ | 114.40 |
| టేకుమట్ల | 41.42 |

# ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చి మొసలి కన్నీరు కారుస్తున్నాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సూర్యాపేటలో జగదీష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలన చేతకాని రేవంత్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంగా ఏర్పడినప్పుడే తెలంగాణ అప్పులతో మొదలైందని, అయినా పదేండ్లు కేసీఆర్ చేసిన అభివృద్ధి పాలన చూడలేదా అని అన్నారు. ఆదాయ వ్యయాల్లో కేసీఆర్‌కు, రేవంత్ కు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రేవంత్ మాట్లాడిన ప్రతిమాట అబద్ధమని, రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని బట్టే కేసీఆర్ హామీలిచ్చారని చెప్పారు. రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చి అమలు చేతకాక ఇప్పుడు చేతులెత్తేసిండని విమర్శించారు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి.. గాలిమోటర్లో తిరిగి.. అప్పులు పుడతలేవంటున్నరని, సీఎం హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గి మంత్రుల ఆదాయం పెరగడంతోనే అసలు సమస్య వస్తుందని చెప్పారు. హామీలు ఎగ్గొట్టడం కోసమే రేవంత్ దొంగ ఏడుపులు ఏడుస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పి రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేయాలన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

- ఇద్దరు యువకులు దుర్మరణం


లోకేష్ (ఫైల్)


నిఖిల్ (ఫైల్)

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా.. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్ఎల్‌బీసీ కాలనీకి చెందిన మాదగాని లోకేశ్(24), కట్టంగూర్ మండలం మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దోనిబావి గ్రామానికి చెందిన రాచకొండ నిఖిల్(21) స్నేహితులు. లోకేశ్ ఐటీఐ పూర్తిచేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తయారుచేసే కంపెనీలో అంప్రెంటీస్ చేస్తున్నాడు. నిఖిల్ డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. లోకేశ్ మంగళవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై పెద్దోనిబావి గ్రామానికి వచ్చి నిఖిల్‌ను పిలుచుకొని నకిరేకల్ మీదుగా 365వ నంబర్ జాతీయ రహదారిపై అర్వపల్లి వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న రాచకొండ నిఖిల్‌కు తీవ్రగాయాలు కావడంతో పాటు కారును నడుపుతున్న మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన దేశగాని విఠల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిఖిల్, విఠల్‌ను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని, మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

## ఈదురుగాలులకు ఒరిగిన ధ్వజ స్తంభం

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లిలో మంగళవారం భారీ ఈదురుగాలులతో కూడి వర్షం కురవగా.. గ్రామ శివారులోని పురాతన శ్రీలక్ష్మీనృసింహస్వామి, మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభం ఒక పక్కకు ఒరిగింది. శివాలయంలోని భారీ చెట్లు నేల కొరిగాయి. ఆలయ పునరుద్ధరణలో భాగంగా 1995లో ఇండియా సిమెంట్స్ కంపెనీ యాజమాన్యం ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్లు కొందూటి సిద్ధయ్య, పాదిల శ్రీనివాస్ తెలిపారు. విశిష్టమైన ఆలయాలు దెబ్బతినడం పట్ల అర్చకులు నాగేంద్రప్రసాద్‌శర్మ, సాంబశివరావుశర్మ, రామానుజాచార్యులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.


లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఒరిగిన ధ్వజ స్తంభం (ఇన్‌సెట్‌లో) స్తంభం కింది భాగం

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

- కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం


బోల్తాపడిన కారు

తిప్పర్తి: అతివేగంగా వస్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. అనంతరం ఆ కారుపై విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈ ఘటన తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో గుంటూరుకు వెళ్లి సోమవారం రాత్రి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. కారు ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడిపోయింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

# విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి జైలుశిక్ష

నిడమనూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. 2018 నవంబర్‌లో తిరుమలగిరి మండలం తునికినూతల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉబ్బరపల్లి శ్రవణ్ గ్రామసభలో వ్యక్తిగత మరుగుదొడ్ల జాబితా చదువుచుండగా అదే గ్రామానికి చెందిన రమావత్ దేవూనాయక్ లబ్ధిదారుల జాబితాను కార్యదర్శి నుంచి లాక్కోని, అతడి వాహనం తాళం చెవి దుర్భాషలాడాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు సాక్షులను విచారించిన నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దేవూనాయక్‌కు ఒక నెల జైలు శిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎం. సాధన వాదనలు వినిపించారు.

**గాయపరిచిన కేసులో..**

గాయపరిచిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు నిడమనూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు..పెద్దవూర మండలం కుకుండుచెట్టుతండా వద్ద కంచర్ల శ్రీను ఎలక్ట్రికల్ సర్వీసింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2016 ఆగస్టులో నిడమనూరు మండలం చెర్వుతండాకు చెందిన రమావత్ హతిరామ్ శ్రీను వద్ద ఫ్యాన్ రిపేరు చేయించుకొని డబ్బులు ఇవ్వకుండా వెళ్తూ ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో హతిరామ్ ఫ్యాన్ తీసుకొని శ్రీనును గాయపర్చాడు. సాక్షులను విచారించిన నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి హతిరామ్‌కు జడ్జి రూ.1000 జరిమానా లేదా నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మునగాల: కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మునగాల మండలం నారాయణగూడెంలో జరిగింది. వివరాలు.. నారాయణగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కాసాని వెంకటేశ్వర్లు తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా.. మోకు తెగిపోయి చెట్టు పైనుంచి కిందపడ్డాడు. అతడి కుడి కాలు విరగగా, తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లును ఆటోలో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రభుత్వం , తోడ్పాటునివ్వాలని గ్రామస్తులు కోరతున్నారు.

## రసాయన వ్యర్థాల శాంపిల్స్ సేకరణ


శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

చివ్వెంల(సూర్యాపేట): లారీల్లో రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సోమవారం రాత్రి చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారి పక్కన రహదారి పక్కన వదిలిపెట్టారు. మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రోడ్డు పక్కన పారబోసిన రసాయనిక వ్యర్థాల శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వ్యర్థాలు వదిలిన లారీలను స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## బావిలో పడి బాలుడు మృతి


చరణ్ (ఫైల్)

వలిగొండ: సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం ఎం. తుర్కపల్లిలో సోమవారం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం. తుర్కపల్లికి చెందిన బట్టు సుధాకర్ చిన్న కుమారుడు బట్టు చరణ్(12) చెవిటి, మూగవాడు. సోమవారం మధ్యాహ్నం సుధాకర్ సోదరుడి కుమారుడు బట్టు గౌతంతో కలిసి చరణ్ ఎం. తుర్కపల్లి గ్రామానికే చెందిన తుమ్మల బాల్‌రెడ్డి వ్యవసాయ బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. వీరికి ఈత రాకపోవడంతో బావి ఒడ్డున స్నానం చేస్తుండగా చరణ్ కాలుజారి బావిలో పడిపోయాడు. భయంతో ఇంటికి వెళ్లిన గౌతం ఇంట్లో ఎవరికీ ఈ విషయం చెప్పలేదు. సాయంత్రం వరకు చరణ్ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. చరణ్ బావిలో పడిన విషయాన్ని గౌతం కుటుంబ సభ్యులకు చెప్పడంతో బావి వద్దకు వెళ్లి విద్యుత్ మోటార్లతో నీటిని తోడుతుండగా చరణ్ మృతదేహం లభించింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం చరణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

## మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

హుజూర్‌నగర్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలు.. చిలుకూరు మండలం లక్ష్మీపురం గ్రామం నుంచి కొందరు అక్రమార్కులు టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నాలుగు మట్టి టిప్పర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. మట్టి టిప్పర్లను పట్టుకున్న విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశామని, వారు జరిమాన విధిస్తారని చెప్పారు.

## ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

నల్లగొండ: నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ మైదానంలో మంగళవారం ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ జిల్లా అసోసియేషన్, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా నీటిపారుదల శాఖ ఇంజనీర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ ఆంజనేయులు, క్రాంతికుమార్, శివరాత్రి శ్రీను, ప్రభాకర్, నాగరాజు, సంతోష్‌రెడ్డి, మహేష్, చంద్రకాంత్ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

## మద్యం దుకాణంలో రూ.5లక్షల నగదు చోరీ

రామన్నపేట: రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదురుగా గల శ్రీలక్ష్మి వైన్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాలకు చెందిన కోనేటి ఎల్లయ్య రామన్నపేటలో శ్రీలక్ష్మి వైన్స్ నిర్వహిస్తున్నాడు. ఆది, సోమవారం మద్యం అమ్మగా వచ్చిన డబ్బులను సోమవారం రాత్రి షాపులోని కౌంటర్‌లో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో షాపు తెరచి చూడగా కౌంటర్‌లోని డబ్బులు కనిపించలేదు. లోపలికి వెళ్లి పరిశీలించగా వెనుక రూం వెంటిలేటర్ పగులగొట్టి ఉంది. సీసీ ఫుటేజీ పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి వెంటిలేటర్ నుంచి లోపలికి ప్రవేశించి కాటన్ డబ్బాను ముఖానికి అడ్డుగా పెట్టుకుని కౌంటర్‌లోని డబ్బులను కాజేసి పారిపోయినట్లు రికార్డయ్యింది. చోరీకి గురైన సొమ్ము రూ.5లక్షలకు పైనే ఉంటుందని వైన్స్ యజమాని ఎల్లయ్య తెలిపాడు. ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

## ట్రాక్టర్ బ్యాటరీ అపహరణ

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌పేట గ్రామానికి చెందిన రైతు సోకం మల్లేష్ తన వ్యవసాయ బావి వద్ద సోమవారం రాత్రి తన ట్రాక్టర్‌ను ఉంచి ఇంటికి వెళ్లాడు. మంగళవారం వెళ్లి చూసేసరికి ట్రాక్టర్‌లోని బ్యాటరీ కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీ చోరీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. బ్యాటరీ విలువ సుమారుగా రూ.12వేలు ఉంటుందని తెలిపాడు.

## విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

నిడమనూరు: ఈదురుగాలులకు చెల్లాచెదురైన రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నిడమనూరు మండలం కక్కయ్యగూడెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కక్కయ్యగూడేనికి చెందిన కుంచం సైదయ్య(40) ఇటీవల 20 గొర్రె పిల్లలను కొనుగోలు చేశాడు. వాటి కోసం ఇంటి వద్ద తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. సోమవారం రాత్రి వచ్చిన ఈదురుగాలులకు షెడ్డు చెల్లాచెదురైంది. మంగళవారం ఉదయం సైదయ్య రేకుల షెడ్డుకు మరమ్మతులు చేస్తుండగా.. షెడ్డులో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన ఫ్యాన్ వైరు రేకులకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# రైల్వే వ్యవస్థ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి


నల్లగొండ రైల్వే స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

రామగిరి(నల్లగొండ): రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరించే విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ జిల్లా నాయకులు మంగళవారం నలగొండ రైల్వే స్టేషన్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలో రైల్వే వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైల్వే రంగంలో భద్రతా చర్యలు పెంచాలని, ప్రమాదాలు అరికట్టాలని ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రైవేటీకరణ వల్ల సరుకు రవాణా చార్జీలు పెరగడంతో వస్తువుల రేట్లు పెరుగుతాయన్నారు. ప్రయాణికుల భద్రత కోసం సరైన చర్యలు చేపట్టాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ప్యాసింజర్ రైళ్లు పెంచాలని, రైళ్లల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, గంజి నాగరాజు, పల్లె నగేష్, అవుట రవీందర్, నకరెకంటి సత్తయ్య, లింగస్వామి, వెంకన్న, రాధాకృష్ణ పాల్గొన్నారు.